


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

తమిళనాడులో

## ఏనుగుల బీభత్సం.. ఇద్దరు మృతి



తమిళనాడులో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఈ ఘటన కృష్ణగిరి జిల్లా ఓసూరు సమీపంలో జరిగింది. జనావాసాల్లోకి వచ్చిన ఏనుగులు గ్రామస్తులపై దాడి చేయగా.. ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డవారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆటవీ అధికారులు ఏనుగులు జనావాసాల్లోకి రాకుండా చూసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# యశస్వీ రెండో డబుల్

## సెహ్వాగ్, రోహిత్ రికార్డ్స్‌ను చెరిపేసిన జైస్వాల్!



ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 196/2తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు శుభ్‌మన్ గిల్, కుల్దీప్ యాదవ్ మంచి ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు మరో 50 పరుగులు జోడించారు. అయితే సెంచరీ కొడతాడనుకున్న శుభ్‌మన్ 91 పరుగుల వద్ద అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. అనంతరం మూడో రోజు ఆట రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్‌కు వెళ్లిన యశస్వీ జైస్వాల్ మళ్లీ క్రీజులోకి వచ్చాడు. ఆ కాసేపటికే 27 పరుగులు చేసిన కుల్దీప్ యాదవ్‌ను రెహాన్ అహ్మద్ పెవిలియన్ చేర్చాడు. దీంతో 258 పరుగులకు టీమిండియా 4 వికెట్లు కోల్పోయింది. అనంతరం జత కట్టిన యువ బ్యాటర్లు యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ టీమిండియా స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. వన్డే తరహాలో ధాటిగా బ్యాటింగ్ చేసిన వీరిద్దరు ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోశారు. లంచ్ బ్రేక్ సమయానికి జట్టు స్కోర్‌ను 300 దాటించారు. దీంతో మొదటి సెషన్ ముగిసే సమయానికి భారత జట్టు 4 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. భారత జట్టు ఆధిక్యం కూడా 400 దాటింది. మొదటి సెషన్‌లో 118 పరుగులు రాగా 2 వికెట్లు పడ్డాయి. లంచ్ బ్రేక్ అనంతరం మొదలైన రెండో సెషన్‌లో జైస్వాల్, సర్ఫరాజ్ ఇద్దరూ రెచ్చిపోయి బ్యాటింగ్ చేశారు. టెస్ట్ మ్యాచ్‌లో టీ20 స్టైలు బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించారు. రెండో సెషన్ ఆరంభంలోనే 150 పరుగులు పూర్తి చేసుకున్న జైస్వాల్.. ఇంగ్లండ్ స్టార్ బౌలర్ అండర్సన్ వేసిన 85వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సులు కొట్టాడు. దీంతో ఆ ఓవర్లో ఏకంగా 21 పరుగులొచ్చాయి. తర్వాత కూడా దూకుడు కొనసాగించిన జైస్వాల్ చూస్తుండగా డబుల్ సెంచరీకి చేరువయ్యాడు. జైస్వాల్‌కు మంచి సహకారం అందించిన సర్ఫరాజ్ ఖాన్ 66 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో అరంగేట్ర టెస్టులోనే రెండు ఇన్నింగ్స్‌ల్లో హాఫ్ సెంచరీలు చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. జోరూట్ వేసిన 97వ ఓవర్‌లో సింగిల్ తీసి జైస్వాల్ డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. డబుల్ సెంచరీ అనంతరం అదే ఓవర్‌లో జైస్వాల్ రెండు సిక్సులు బాదడంతో 15 పరుగులొచ్చాయి. జట్టు స్కోర్ 400 దాటకగా.. ఆధిక్యం కూడా ఏకంగా 500 పరుగులు దాటింది. జైస్వాల్, సర్ఫరాజ్‌ను ఎలా ఆపాలో తెలియక ఇంగ్లండ్ బౌలర్లు దిక్కులు చూడకతప్పలేదు. రెహాన్ అహ్మద్ వేసిన 98వ ఓవర్‌లో సిక్స్, ఫోర్, సిక్స్ బాదిన సర్ఫరాజ్ ఖాన్ 18 పరుగులు రాబట్టాడు. ఈ సమయంలోనే జట్టు స్కోర్ 430/4 వద్ద ఉన్న సమయంలో టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. దీంతో ఇంగ్లండ్‌పై భారత జట్టు 556 పరుగుల ఆధిక్యం సాధించింది. రాజ్‌కోట్ టెస్టులో భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్(213 నాటౌట్: 235 బంతుల్లో 14 ఫోర్లు, 12 సిక్సర్లు) రెండో డబుల్ సెంచరీ కొట్టాడు. అరంగేట్రం బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్(51 నాటౌట్: 67 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్) వరుసగా రెండో హాఫ్ సెంచరీ సాధించాడు. ఇద్దరూ దూకుడుగా ఆడుతున్న సమయంలోనే 430/4 వద్ద భారత కెప్టెన్ రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. దాంతో, ఇంగ్లండ్‌కు 557 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.







### తిరిగి జట్టులోకి అశ్విన్..

భారత క్రికెట్ అభిమానులకు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా రాజ్‌కోట్ టెస్టులో రెండో రోజు ఆట తర్వాత చెన్నైకి పయనమైన టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. నాలుగో రోజు ఆట అంటే ఆదివారం నుంచి తిరిగి జట్టులో చేరనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. అశ్విన్ తిరిగి జట్టులో చేరి జట్టు అవసరం కోసం తన వంతు కృషి చేయనున్నట్లు పేర్కొంది.కాగా టీమిండియా స్పిన్నర్ అశ్విన్ రాజ్‌కోట్ టెస్టులో రెండో రోజు జాక్ క్రాలీని ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో 500 వికెట్లు తీసిన తొమ్మిదో బౌలర్‌గా నిలిచాడు. అయితే ఆ రోజు ఆట పూర్తయిన తర్వాత రవి చంద్రన్ అశ్విన్ జట్టు నుంచి అర్ధంతరంగా వైదొలిగాడు. తన తల్లి ఆరోగ్యం విషమించడంతో అశ్విన్.. జట్టుకు దూరమైనట్లు వార్తలు వచ్చాయి. ఈ స్పిన్నర్ గైర్హాజరుపై అప్పుడు బీసీసీఐ ప్రకటన కూడా విడుదల చేసింది. దీంతో టెస్టు మూడో రోజు అయిన శనివారం భారత జట్టు 10 మందితోనే ఆడింది. అశ్విన్‌కు సబ్‌స్టిట్యూట్‌గా దేవ్‌దత్ పడిక్కల్ ఫీల్డింగ్ చేశాడు.అశ్విన్ ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా జట్టుకు దూరం కావడంతో ఐసీసీ రూల్స్ ప్రకారం కేవలం సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌ను మాత్రమే జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అతడు బౌలింగ్ కానీ, బ్యాటింగ్ కానీ చేయకూడదు. దీంతో భారత్.. నలుగురు ఫుల్‌టైమ్ బౌలర్లతోనే ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేసింది. రెండో రోజు ఆటలో అశ్విన్ ఒక వికెట్ తీశాడు. అశ్విన్ జట్టు నుంచి వైదొలగడంతో మూడో టెస్టు మొత్తానికి దూరమవుతాడా అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే అతడు నాలుగోరోజు ఆట సమయానికి అందుబాటులో ఉన్నాడని బీసీసీఐ ప్రకటన విడుదల చేసింది.

### అరంగేట్ర టెస్టులోనే రెండు అర్థ శతకాలు.. సర్ఫరాజ్ అరుదైన ఘనత

భారత జట్టులో రాకరాక వచ్చిన అవకాశాన్ని ముంబై కుర్రాడు సర్ఫరాజ్ ఖాన్ రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో అరంగేట్రం చేసిన యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. ఆడుతున్న తొలి టెస్టులోనే రెండు ఇన్నింగ్స్‌లలోనూ అర్థ సెంచరీలతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 66 బంతుల్లోనే 62 పరుగులు చేసిన ఈ ముంబై కుర్రాడు.. రెండో ఇన్నింగ్స్‌లో 72 బంతులాడి 68 పరుగులు చేశాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అర్థ సెంచరీలు చేయడంతో సర్ఫరాజ్ ఖాన్.. ఆడుతున్న తొలి టెస్టులోనే ఈ ఘనత అందుకున్న నాలుగో భారత బ్యాటర్‌గా నిలిచాడు. భారత్ తరఫున గతంలో దిలావర్ హుస్సేన్, సునీల్ గవాస్కర్, శ్రేయస్ అయ్యర్‌లు ఈ ఘనత అందుకున్నవారిగా ఉన్నారు. దిలావర్ హుస్సేన్.. 1934లో ఇంగ్లండ్‌తో ఆడిన మ్యాచ్‌లో 59, 57 పరుగులు చేశాడు. ఆ తర్వాత భారత బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్..

1971లో క్వీన్స్ పార్క్ ఓవల్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో 65, 67 రన్స్ సాధించాడు. 2021లో టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్.. కాన్పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 105 రన్స్ చేయగా రెండో ఇన్నింగ్స్‌లో 65 పరుగులు చేశాడు. తాజాగా సర్ఫరాజ్ ఖాన్.. 62, 68 పరుగులతో వారి సరసన చేరాడు.

## దళపతి విజయ్ పార్టీ పేరులో మార్పు..

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్‌కి తెలుగులోనూ బోలెడంత మంది ఫ్యాన్స్ ఉన్నారు. గతేడాది 'వారసుడు', 'లియో' సినిమాలతో అలరించిన విజయ్.. ప్రస్తుతం 'ద గోట్' అనే మూవీతో బిజీగా ఉన్నాడు. అయితే కొన్ని రోజుల ముందు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. 2026లోని తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పుడు పార్టీ పేరులో స్వల్ప మార్పు చేశారు. దళపతి విజయ్ పెట్టిన రాజకీయ పార్టీ పేరు 'తమిళగ వెట్రి కళగం'. ఇందులోనే తప్పు దొర్లినట్లు తమిళ మేధావుల సూచించారు. ఈ మేరకు స్వల్ప మార్పు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తమిళంలో అదనంగా 'క్' అనే అక్షరాన్ని జోడించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఎన్నికల కమిషన్‌లో ఇదే పేరుతో రిజిస్టర్ చేశారు. కానీ తమిళగ వెట్రి కళగంని ఇంగ్లీష్‌లో టీవీకే అని పిలుస్తున్నారు. దీనిపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళగ వాల్వురిమై కట్చి తదితర కొన్ని చిన్న పార్టీల పేర్లు కూడా ఇంగ్లీష్‌లో టీవీకే అని పిలుస్తున్నారు. ఇదే టైంలో విజయ్ పార్టీని కూడా ఇదే పేరుతో పిలుస్తుండటం వల్ల తమకు ఇబ్బంది కలుగుతుందని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే మేధావుల నిర్ణయం మేరకు.. తమిళగ వెట్రి కళగం పేరులో 'క్' అనే అక్షరాన్ని జోడించారు. దీంతో ఇకపై 'తమిళగ వెట్రిక్ కళగం' అని పిలవాలని పార్టీ వర్గాలు నిర్ణయించాయి.






## విమాన ప్రమాదం నుంచి తప్పించుకున్న నేషనల్ క్రష్

'యానిమల్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకుంది కన్నడ సోయగం రష్మిక మందన్న. ఈ సినిమా ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెట్టింది. అయితే వరుస షూటింగ్‌లతో బిజీగా ఉన్న రష్మికకు తాజాగా చేదు అనుభవం ఎదురైంది. ఆమె తృటిలో విమాన ప్రమాదం నుంచి తప్పించుకుంది. రష్మిక ఇటీవల ముంబయి నుంచి హైదరాబాద్‌కు విమానంలో ప్రయాణించింది. అయితే రష్మిక ప్రయాణిస్తున్న విమానంలో సాకేంతిక సమస్య ఏర్పడడంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటనతో రష్మిక ఎంతో కంగారు పడింది. ప్రస్తుతం ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. ఇక రష్మికతో పాటు టాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా దాస్ కూడా విమానంలో ఉన్నారు.అయితే ఈ ఘటన అనంతరం ఇదే విషయాన్ని రష్మిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేస్తూ.. ఈరోజు మేము చావు నుంచి తప్పించుకున్నాము' అంటూ శ్రద్ధాకపూర్‌తో కలిసి దిగిన ఫోటోని షేర్ చేసింది. దీంతో రష్మిక పోస్ట్ వైరల్ అయింది.

## విశాఖను విషాదపట్నంగా మార్చేశారు: నారా లోకేశ్

వైసీపీ పాలనలో విశాఖను గంజాయి క్యాపిటల్‌గా మార్చారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. నగరంలోని తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అప్పులమయం చేసింది. విశాఖను విషాదపట్నంగా మార్చేశారు. నగరానికి చంద్రబాబు నెలకొక ఐటీ కంపెనీ తీసుకొచ్చారు. ఇప్పుడు రోజుకో భూకుంభకోణం, హత్యలు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయి. లాలూచీతో విశాఖ ఉక్కును ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు నెలల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుంది. అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కును అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. రైల్వే జోన్, నగరానికి మెట్రో ప్రాజెక్టు హామీలను జగన్ నెరవేర్చలేదు. చంద్రబాబు సూపర్-6 పేరుతో హామీలను ప్రకటించారు. ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ఏటా డీఎస్సీ ప్రకటిస్తాం. నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి, 18-59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 అందజేస్తాం" అని లోకేశ్ తెలిపారు.






## తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు

తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇక, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా ఏకంగా 62 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. వివరాల ప్రకారం.. తెలంగాణలో అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు వివిధ శాఖల్లోని పలువురు అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయగా.. తాజాగా పోలీసు శాఖలో మరోసారి పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. ఆదివారం 62 మంది డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ క్రమంలో డీజీ ఆఫీస్‌లో వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీలందరికీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. తాజా బదిలీలతో తెలంగాణలో ఇప్పటి వరకు 300 మంది డీఎస్పీలు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. డీఎస్పీలతో పాటుగా హైదరాబాద్‌లో పలువురు ఏసీపీలను సైతం బదిలీ చేసింది. ఈ మేరకు హోంశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు బదిలీలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




# సెగలు పుట్టిస్తోన్న నిధి షా

అభిమానుల దృష్టిని ఆకర్షించింది.తాజా ఫోటోలలో నిధి షా బోల్డ్ స్టైల్ కనిపిస్తోంది. నిధి షా రెడ్ కలర్ చీరలో చాలా కూల్ చిత్రాలను పోస్ట్ చేసింది. నిధి షా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి చిత్రాలను పంచుకుంది. నిధి షా యొక్క తాజా చిత్రాలు వేగంగా వైరల్ అవుతున్నాయి. నటి యొక్క ఈ చిత్రాలను అభిమానులు ఇష్టపడుతున్నారు. చిత్రాలపై వ్యాఖ్యానిస్తున్నారు.







# మళ్లీ మోడీదే అధికారం..

## దేశ ప్రజలకు అనుమానమే లేదు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రధాన మంత్రి మోడీ మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారనే అంశంలో దేశ ప్రజలకు ఎలాంటి అనుమానం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం అంత్య దశకు చేరుకున్నాయని.. వచ్చే మోదీ 3.0 ప్రభుత్వంలో అవి పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలను మహాభారత యుద్ధంతో పోల్చిన ఆయన.. మోడీ ఒకవైపు.. కుటుంబ పార్టీలకు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ మరోవైపు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మోడీ పేద ప్రజలు, దేశ అభివృద్ధి కోసం ఆలోచిస్తారని షా అన్నారు. మరోవైపు ప్రతిపక్ష కూటమి 'ఇండియా' కూటమి నేతలు తమ వారసులను ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిని చేయడంలో నిమగ్నమయ్యారని విమర్శించారు. భాజపాలోనూ ఇదే తరహా విధానం ఉండి ఉంటే ఒక చాయ్‌వాలా కుమారుడు ప్రధాని అయ్యేవాడు కాదని అన్నారు. మోదీని ఓడించేందుకు రాకుమారులంతా ఏకమయ్యారని పరోక్షంగా ప్రతిపక్ష కూటమి పార్టీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బుజ్జగింపు రాజకీయాల వల్లే రామమందిర ప్రాణప్రతిష్ఠ ఆహ్వానాన్ని కాంగ్రెస్ నిరాకరించిందని ధ్వజమెత్తారు.



# కమల్‌నాథ్ బాటలో ఎంపీ మనీష్ తీవారీ?

కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ పార్టీ మారబోతున్నారని వర్తాలు వెలువడ్డాయి. ఆయన కాంగ్రెస్‌కు రాజానామా చేసి.. బీజేపీలో చేరుబోతున్నారని జోరుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఎంపీ మనీష్ తివారీపై జరుగుతున్న ప్రచారం అసత్యమని ఆయన ఆఫీసు వర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఎంపీ మనీష్ తివారీపై జరుగుతున్న పార్టీ మార్పు ప్రచారాన్ని ఖండించింది. అదంతా అసత్య ప్రచారమని స్పష్టం చేసింది. బీజేపీలో చేరి.. లూథియానా స్థానంలో పోటీ చేయనున్నట్లు ప్రచారం జరిగింది. 'మనీష్ పార్టీ మారి బీజేపీలో చేరుతారనేది నిరధారమైన విషయం. ఆయన తన నియోజకవర్గంలో పూర్తి దృష్టి పెట్టారు. గత రాత్రి మనీష్ తివారీ తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు' అని ఎంపీ కార్యాలయం పేర్కొంది. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, ఆయన కుమారుడు నకుల్, ఇతర ఎంపీలు కూడా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా పార్టీ మారుతున్నట్లు ఊహాగానాలు వచ్చాయి. మధ్య ప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ మీద వచ్చిన ప్రచారాన్ని రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ జితూ పట్వారీ ఖండించారు. కమల్‌నాథ్‌పై జరుగుతున్న ప్రచారం నిరాధారమైందని స్పష్టం చేశారు. కనీసం కలలో కూడా కమల్‌నాథ్ బీజేపీలో చేరరని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ నేత కమల్ నాథ్, తన కొడుకు నకుల్‌తో శనివారం ఢిల్లీకి వెళ్లిన సందర్భంగా బీజేపీలో చేరుతారని పెద్ద ఎత్తున జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు బీజేపీ పార్టీలో చేరటం కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది. ఇక.. కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరితే కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని 'ఇండియా కూటమి' లోక్‌సభ ఎన్నికల్లో తగిన ప్రభావం చూపలేకపోతుందని రాజకీయా విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# చికెన్ అతిగా తింటే జరిగే నష్టాలు ఇవే..!

నాన్ వెజ్ లలో ఎక్కువమంది ఇష్టంగా తినేది చికెన్. వారానికి రెండుసార్లు చికెన్ తినడం ఆరోగ్యమే. కానీ కొందరు నాన్ వెజ్ ప్రియులు చికెన్ ఎక్కువగా తింటుంటారు. అయితే దీనివల్ల శరీరంలో సోడియం అధికంగా పెరిగి రక్తపోటు సమస్యలకు దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు. చికెన్ లో ఉండే ఓ ప్రత్యేక రసాయనం వల్ల పెద్ద పేగు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందట. కాబట్టి చికెన్ అతిగా కాకుండా మితంగా తినాలని వైద్యులు సూచిస్తున్నారు.



# మంచు లక్ష్మీ ఎమోషనల్ పోస్ట్

టాలీవుడ్ హీరో మంచు మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మి తన ఇన్స్టా గ్రామ్ లో ఓ ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసింది. ఈ మేరకు ఆమెకు యోగా టీచర్ గా పనిచేసిన రూహీతో చివరిగా చాట్ చేసిన మిసేజ్ ను షేర్ చేస్తూ ఎమోషనల్ అయింది. 'ఇది రూహీ నుండి నా చివరి సందేశం. తన ముఖంలో ఎప్పుడూ ఎలాంటి కల్మషం లేని నవ్వుతో కనిపిస్తూ ఉండేది. మీరు ఇంత త్వరగా మమ్మల్ని విడిచి పెట్టినందుకు నేను చాలా బాధపడుతున్నాను' అని రాసుకొచ్చారు.




## సత్తా చాటిన సింధూ, అన్మోల్, గాయత్రి..

# భారత్ ఖాతాలో తొలి టైటిల్..

ఆదివారం జరిగిన తొలి బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను థాయ్‌లాండ్‌ను 3-2తో ఓడించి, పీవీ సింధు, అన్మోల్ ఖర్బ్, ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ ద్వయం భారత్ తరఫున మెరిశారు. సింధు సుపనిదా కతేథాంగ్‌తో తలపడిన తొలి మ్యాచ్‌లో భారత్‌కు 21-12, 21-12 తేడాతో విజయం సాధించి 1-0తో విజయం సాధించింది. మొదటి మహిళల డబుల్స్ మ్యాచ్‌లో ట్రీసా, గాయత్రి ఆడారు. అక్కడ ఈ జోడీ 21-16, 18-21, 21-16 తేడాతో విజయం సాధించి భారతదేశ ఆధిక్యాన్ని 2-0కి పెంచారు. 'బెస్ట్ ఆఫ్ ఫైవ్' రూల్‌తో టై ఆపరేట్ చేయడంతో, బుసానన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్‌తో జరిగిన తన సింగిల్స్ మ్యాచ్‌లో అష్మితా చలిహా భారత్‌ను క్లీన్ స్వీప్ చేసే అవకాశం పొందింది. అయితే, ఆ తర్వాతి మ్యాచ్ మొత్తంలో మెరుగైన ఆటగాడిగా 11-21తో భారతీయులను ఓడించింది. థాయ్‌లాండ్‌ను తిరిగి సమీకరణంలోకి తీసుకొచ్చారు. బెన్యాపా ఐమ్‌సార్డ్, నుంటకర్న్ ఐమ్‌సార్డ్ 21-11, 21-9తో ప్రియా కొంజెంగ్‌బామ్, శ్రుతి మిశ్రా జట్టును ఓడించి థాయ్‌లాండ్‌కు 2-2తో విజయం సాధించిన తర్వాత ఇది పునరాగమనాన్ని పూర్తి చేసింది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో అన్మోల్ పోర్న్‌పిచా చొయికీవాంగ్‌తో ఆడటంతో, యువ భారత ఆటగాళ్లు సత్తా చాటారు. 21-14, 21-9 స్కోరుతో 3-2తో విజయం సాధించి, భారతదేశం చారిత్రాత్మక టైటిల్‌ను గెలుచుకునేలా చేశారు.

# ఓటీటీలోకి వచ్చేస్తున్న బ్లాక్ బస్టర్ మూవీ హను మాన్

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ మూవీ హనుమాన్.. సంక్రాంతి కానుకగా జనవరి 12 న రిలీజ్ అయిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు పెయిడ్ ప్రీమియర్స్ మరియు సినిమా షోస్ చూసిన ప్రేక్షకులు హనుమాన్ సినిమాను ప్రశంసలతో ముంచెత్తారు. డైరెక్టర్ ప్రశాంత్ వర్మను ఎంతగానో ప్రశంసించారు.ఇప్పటికీ కూడా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల పరంపర కొనసాగిస్తున్న హనుమాన్ చిత్రం ఓటీటీ విడుదల తేది ఆసక్తికరంగా మారింది. హనుమాన్ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 సొంతం చేసుకుంది. హనుమాన్ పాన్ ఇండియా స్థాయిలో ఉండటంతో దానికి తగినట్లుగానే ఓటీటీ హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు సమాచారం.

